క్లుప్తంగా

మష్కూర్ గంధ మహోత్సవం వాల్ పోస్టర్ విడుదల



గంధ మహోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్‌షా మష్కూర్ బాబా దర్గాలో అక్టోబర్ 9న 13వ గంధ మహోత్సవం జరుగుతుందని దర్గా పీఠాధిపతులు తెలిపారు. మిలాద్ నబీ పండగ వేడుకలు, హజరత్ మహమ్మద్ ప్రవక్త విశిష్టతను భక్తులకు వివరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గంధ మహోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు హజరత్ సయ్యద్‌షా సాహెబ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు పెంచలయ్య

ఆత్మకూరు: ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ దివ్యాంగ యువకుడు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని అప్పారావుపాళెం మాతమ్మగుడి వద్ద ఆదివారం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. అప్పారావుపాళెం గ్రామానికి చెందిన సీహెచ్ పెంచలయ్య దివ్యాంగుడు. తన మూడు చక్రాల వాహనంలో సొంత పనిమీద గ్రామంలో రోడ్డు మలుపు తిరుగుతుండగా మాతమ్మ గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో పెంచలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఆత్మకూరులోని ఆస్పత్రికి వైద్యం కోసం తరలించారు. బాధిత బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: సోమవారం వినాయక చవితిని ప్రజలు అందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు విఘ్నాలు అని తొలగి రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

రాజారెడ్డి చవితి శుభాకాంక్షలు



రాజారెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ చవితి వేడుకలు భక్తి పూర్వకంగా, ఆనందంతో జరుపుకోవాలని, మండపాల వద్ద తగిన జాగ్రత్తలు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం ఆమని చిరువెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ గాలిబోయిన చిన్న నర్సింహులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం పలువురు నాయకులు, గ్రామస్తులు ఆమనిచిరువెళ్ల గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు, వైద్యులు

జలదంకి: మండలంలోని అన్నవరంలో ఆదివారం కాసు వెంగళరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో నెల్లూరు స్మార్ట్ విజన్ హాస్పిటల్ వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ బీరం రాజేందర్‌రెడ్డి గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి నెల్లూరు స్మార్ట్ విజన్ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు చేవూరి హరిప్రసాద్‌రెడ్డి, జలదంకి వైస్ ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే జగనన్న లక్ష్యం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలతో సంబంధం లేకుండా పేద వాళ్లకు ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా అండగా ఉండాలనే సామాజిక న్యాయం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలన చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలం సిరిపురంలో ఆదివారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ ఎమ్మెల్యే ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లుగా పేదలకు మంచి జరగాలని తపన, తాపత్రయంతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అవకాశం ఉన్న అన్ని చోట్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. అందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఆయా వర్గాల్లో ఆదరణ లభిస్తోందని తెలిపారు. చంద్రబాబు మాదిరి కపట హామీలను చెప్పి మభ్యపెట్టడం జగన్‌మోహన్‌రెడ్డికి తెలియదని, చెప్పిందే చేయడం చేసేదే చెప్పడం ఆయన నైజం అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా విద్య, వైద్యంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకు వచ్చారన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసం ఆలోచిస్తుంటే ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఎలా ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలో ఆలోచిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసినా ప్రజల కోసం చేసింది ఏమీ లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకోవడం, ప్రతిపక్షంలోకి రాగానే నీతులు చెప్పడం చంద్రబాబు నైజం అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికల్లో 600 హామీలను చెప్పి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయకపోగా మేనిఫెస్టోనే లేకుండా చేసిన ఘనుడు చంద్రబాబు అని తెలిపారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల గుండె చప్పుడుగా, సామాజిక న్యాయానికి చిరునామాగా రాష్ట్ర ప్రజల కుటుంబ సభ్యుడిగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలు ఆశీర్వదించి ఇంకా మెరుగైన పాలన జగనన్న ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని, చంద్రబాబులా దళారులను పెట్టి దోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కంపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపీపీ కొండమ్మ, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, నాయకులు నాయుడు రాంప్రసాద్, జక్కంపూడి వెంకటేశ్వర్లు, వల్లూరు దయాకర్‌రావు, పరుసు తిరుపతి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జనిగర్ల మహేంద్ర యాదవ్, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కోడూరు సాధక్‌కుమార్‌రెడ్డి, కనుపర్తి రాజశేఖర్, పేరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



నందవరం ఎస్టీకాలనీలో పేద మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): నియోజకవర్గంలో రైతులు, పేదలు నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏక కాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి బహుముఖ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం నందవరంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. తొలుత నందవరం చెరువు కట్ట జంక్షన్‌లో తల్లపనేని సుబ్బయ్య చౌదరి, శారదమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుడైన వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కోనంకి శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, ముస్లిం బజారు, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గాన్ని నుడా పరిధిలోకి చేర్చడం ద్వారా 15 వేలు గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో జగనన్న కాలనీల ద్వారా 10 వేలు, సొంత స్థలాల్లో ఇల్లు నిర్మించుకునే వారికి 5 వేల గృహాలు చొప్పున మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తిరుపతి ఐఐటీ కళాశాల, ఆత్మకూరులోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను సమన్వయం చేసి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేశామని, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లతో ప్రతి రెండు వారాలకొకసారి సమీక్షించడం ద్వారా రెవెన్యూ సమస్యలను రికార్డ్ స్థాయిలో పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే 22 వేల ఎకరాల్లో చుక్కల భూముల సమస్యలు పరిష్కారం కాగా, 26 వేల నోషనల్ ఖాతా సమస్యలు పరిష్కరించి సరికొత్త చరిత్ర సృష్టించామన్నారు. రీసర్వే ప్రక్రియ ద్వారా డిసెంబరు నాటికి 50 శాతం రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నందవరం ఎస్టీ కాలనీలో తన దృష్టికి తీసుకొచ్చిన ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు, మురికి కాలువల నిర్మాణాల సమస్యలను అక్టోబరు 7వ తేదీలోగా పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నందవరం దర్గాలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, స్థానిక నాయకులు నూనె ప్రసాద్ యాదవ్, రామ్మోహన్ యాదవ్, ఒంటెద్దు కృష్ణారెడ్డి, గయాజ్, మౌలాలి, ఖాదర్‌బాషా, పరిసర గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారధులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జై.. జై గణేశా!

- చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- వాహనాలపై గణేశ్ విగ్రహాల తరలింపు
- ఆకర్షణీయంగా లంబోదరుడు ప్రతిమలు

ఉదయగిరి: వినాయక చవితి వేడుకలకు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సర్వ సిద్ధమైంది. ఆదివారం సాయంత్రం నుంచి ఆయా మండపాలకు వాహనాల ద్వారా యువత వినాయక విగ్రహాలు తరలించారు. యువత కోలాహలంగా వేడుకలకు సిద్ధం అయ్యారు. గతేడాది కంటే ఈ ఏడాది అమ్మకాలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. చిన్న విగ్రహాలను స్థానిక వ్యాపారులు బయట ప్రాంతాల నుంచి తెప్పించి విక్రయాలు జరిపారు. ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, జలదంకి మండల కేంద్రాల్లో విక్రయాలు జోరుగా సాగాయి. పెద్ద పెద్ద విగ్రహాలు నెల్లూరులో ముందుగా ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు. సోమవారం నుంచి వినాయక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు మూడు నుంచి ఏడు రోజుల పాటు జరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 600, పల్లెల్లో 400 పైగా విగ్రహాలు వెలియనున్నాయి.

మండిపోతున్న ధరలు

వింజమూరు, ఉదయగిరి, కలిగిరి మండల కేంద్రాల్లో ఉత్సవ విగ్రహాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. కొందరు వ్యాపారులు నెల్లూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి విగ్రహాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. 5 నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలు ప్రత్యేకతను బట్టి రూ.5 వేల నుంచి రూ.70 వేల వరకు విక్రయిస్తున్నారు. ఎక్కువగా రూ.25 వేల, రూ.30 వేల ధరల మధ్య ఉండే విగ్రహాలకు మంచి డిమాండ్ ఉంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ధరలు ఎక్కువగా ఉన్నాయని ఉత్సవాల కమిటీ నిర్వాహకులు చెబుతున్నారు.

వినాయకచవితి కోలాహలం

కావలి: జైబోలో గణేష్ మహరాజ్‌కి జై.. అంటూ నినాదాలు ఆదివారం మార్మోగాయి. సోమవారం వినాయక చవితి పండగ కావడంతో కావలి పట్టణంలోని వీధుల్లో, చుట్టు పక్కల గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. విగ్రహాలు కొనుగోలు కేంద్రాల నుంచి తరలించే క్రమంలో యువకులు సందడి చేశారు. పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో పూజా సామగ్రి అమ్మకాలకు సిద్ధం కావడంతో స్థానికులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ప్రతిమలు, పూజా సామగ్రిలను కొనుగోలు చేసేందుకు తరలిరావడంతో రద్దీ వాతావరణం నెలకొంది.

ప్రజలకు ఎమ్మెల్యే పండగ శుభాకాంక్షలు

కావలి నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

చవితి సందడి

సంగం: సంగంలో వినాయకచవితి సందడి మొదలైంది. బస్టాండ్ సెంటర్‌లో వినాయక విగ్రహాలు, పూజా సామగ్రిని విక్రయిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు విగ్రహ తయారీ కేంద్రం వద్దకు చేరుకుని ఉత్సవాల కోసం విగ్రహాలను తరలిస్తున్నారు. సంగంలో పండగ వాతావరణం నెలకొంది. పలువురు వ్యాపారులు వినాయకచవితి పూజకు అవసరమైన పత్రి, ఇతర సామగ్రి దుకాణాలను ఏర్పాటు చేసుకుంటూ పండగ శోభను తెప్పిస్తున్నారు.

పూజా సామగ్రి కొనుగోళ్లతో రద్దీ

ఆత్మకూరు: సోమవారం వినాయక చవితి పండగ జరుపుకోనున్న క్రమంలో వినాయకునికి ఇష్టమైన పలు రకాల పుష్పాలు, పత్రాలు, మట్టితో తయారు చేసిన ప్రతిమలు కొనుగోలు చేసేందుకు పట్టణంలోని పలు దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. 21 రకాల పత్రాలు వినాయకుని పూజలో వినియోగించాల్సి రావడంతో వాటిని సేకరించుకునేందుకు చిన్నారులు, యువకులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వినాయక పందిళ్లు ఏర్పాటు చేసి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్నాయి. సోమవారం నుంచి మూడు రోజుల పాటు వినాయక మండపాల్లో పూజలు చేసేందుకు విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పోలీసుల వద్ద అనుమతులు పొందారు. బుధవారం చెరువు వద్ద విగ్రహాల నిమజ్జనం కోసం మున్సిపల్, పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గణపతి విగ్రహాల ఏర్పాటుకు సందడి

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలకు గణపతి విగ్రహాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పట్టణాల్లో సందడి నెలకొంది. ఆదివారం సాయంత్రానికి విగ్రహాలను ఆయా గ్రామాలకు కొనుగోలు దారులు ప్రత్యేక వాహనాల్లో చేర్చుకున్నారు. విగ్రహాలను ప్రతిష్టించేందుకు మండపాలను ఏర్పాటు చేసుకోవడంలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఉదయగిరి, పామూరు, వింజమూరు తదితర పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పూజా సామగ్రి దుకాణాల వద్ద కొనుగోలు దారుల రద్దీ ఏర్పడింది. పండ్లు, పూలు, పూలమాలల ధరలకు రెక్కలొచ్చాయి.



ఆత్మకూరులో వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోళ్ల సందడి



వింజమూరులో విగ్రహాలు తరలిస్తున్న భక్తులు



కావలి: పూజా పత్రి దుకాణాల వద్ద రద్దీ



కావలి: విగ్రహాలు తరలిస్తున్న భక్తులు



సంగం: పూజాసామగ్రి దుకాణాలు



వరికుంటపాడు: గణనాథులను వాహనాల్లో తరలిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



సొసైటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడు అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి అమ్మమ్మ దేశిరెడ్డి లీలమ్మ ఇటీవల దొంగల చేతిలో హత్యకు గురై మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. వృద్ధురాలైన లీలమ్మ వద్ద ఉన్న నగదు, నగలు కోసం దొంగలు దారుణానికి పాల్పడ్డారని రవికుమార్‌రెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. హంతకుడిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసినందున పరిసరాల్లో ఉన్న కుటుంబాలు ఆందోళనకు గురికావద్దని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ చెరుకూరు చిన్న చెంచయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, చేరెడ్డి నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చేజర్లలోని యూటీఎఫ్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడవచ్చన్నారు. వ్యాధులతో బాధపడుతూ ఉండి, అవసరమైన వారికి రక్తం సకాలంలో అందించ వచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తలసేమియా, హీమోఫీలియా, గర్భిణులకు సహాయార్థం ఈ రక్తదాన శిబిరం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. సుమారు 50 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ సేకరించింది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురునాథం పెంచలపుల్లయ్య, వెంకటకృష్ణయ్యసుధాకర్, వెంగబాబు, రామ్ చరణ్, పలువురు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు

మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

అల్లూరు: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధు, అధికారులు సమన్వయంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ శశిరేఖ సూచించారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ ప్రాధానంగా ప్రభుత్వం తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడం తగదన్నారు. పలు శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేణమ్మ, ఎంపీడీఓ శ్రీదేవి, వైస్ ఎంపీపీలు సురేంద్ర, కొండూరు వాసు ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రూ.8 లక్షలతో డ్రెయినేజీ పునర్నిర్మాణం



శిథిలమైన డ్రెయినేజీ కాలువ

కావలి: మండలంలోని సిరిపురంలో ఉన్న డ్రెయినేజీ కాలువ శిథిలమైపోవడంతో పునర్నిర్మాణానికి రూ.8 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. సిరిపురంలో ఎమ్మెల్యే ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు డ్రెయినేజీ కాలువ సమస్యను తీసుకువచ్చారు. సత్వరమే నిధులు మంజూరు చేస్తున్నట్లు, ఆ పనులు కూడా త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు సూచించారు. తాగునీరు అందించే బోరు నుంచి నీరు రాక పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పడంతో, కొత్త బోరును నిర్మించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేతో పాటు గ్రామ సర్పంచ్ జక్కంపూడి రమేష్, నాయకులు ఉన్నారు.

గురుకులంలో రూబీ జూబ్లీ వేడుకలు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఏపీ బాలుర గురుకుల పాఠశాల్లో ఆదివారం పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూబీ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాపించి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు తెలిపారు. ఏపీఆర్ఎస్ సొసైటీ విశ్రాంత ఫార్మా సెక్రటరీ ఎం.నాగాభూషణశర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా కన్న తల్లిదండ్రులను, చదువు చెప్పిన గురువులను మరచిపోరాదన్నారు. ఈ పాఠశాల్లో చదివిన విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి సమాజ సేవ చేయడం సంతోషకరమన్నారు. ఇలాంటి వేడుకలు నిర్వహించి పూర్వ విద్యార్థులందరూ ఆత్మీయ సమ్మేళనం కావడంతో పాటు, ఆ నాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులను మననం చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఫార్మా సెక్రటరీతో పాటు పాఠశాల్లో గతంలో పని చేసిన ప్రిన్సిపల్స్‌ను, ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పుష్పరాజ్, అతిథులు వై.వెంకటనారాయనరెడ్డి, కొమ్మి చంద్రశేఖర్, దేవరకొండ మధుసూదన్, సాల్మన్‌రాజ్, కొండా విజయ భాస్కరరెడ్డి, షేక్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



ఆత్మకూరు: తొలి వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతిని ఆత్మకూరు రవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. బ్రహ్మదేవుని ఆజ్ఞతో విశ్వకర్మ ప్రపంచాన్ని సృష్టించాడని పురాణాల్లో పేర్కొన్నట్లు ఎంవీఐ రాములు తెలిపారు. ద్వారకా మహానగరాన్ని, హస్తినాపురాన్ని విశ్వకర్మే నిర్మించాడని శాస్త్రవచనం. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల నాటిన ఎమ్మెల్యే

కావలి: ఉదయగిరి రోడ్డులో ఉన్న మినీ స్టేడియం ప్రతిపాదిత మైదానం చుట్టూ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం మొక్కలు నాటారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం వాకర్స్ శ్రద్ధ చూపి మొక్కలు నాటడంపై అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.